లక్షలు వెచ్చించి..
లక్ష్యం నీరుగార్చి

రెండేళ్లుగా ప్రారంభం కాని షాపింగ్ కాంప్లెక్స్

- పట్టించుకోని అధికార యంత్రాంగం

కద్దాల్: రూ.లక్షలు వెచ్చించి మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సంబంధిత అధికారులు ప్రారంభించకుండా వదిలివేయడంతో లక్ష్యం నీరుగారుతోంది. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి రెండేళ్లు పూర్తయినా నేటికి ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు దుకాణ భవన సముదాయాన్ని నిర్మించారు. దాదాపు రెండేళ్లు అవుతున్నా ఇంతవరకు ప్రారంభించక పోవడం గమనార్హం. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం కరువైంది.

2022లో నిర్మాణం పూర్తి

పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను 2022 జనవరిలో రూ.48 లక్షలతో గత ప్రభుత్వంలో భూమిపూజ చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు వేగంగా సాగడంతో పది షాపుల గదుల నిర్మాణాలు 2022 ఆగస్టు నెల చివరి వారంలోనే పూర్తయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయినప్పటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి చిరు వ్యాపారులతో పాటు నిరుద్యోగులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి, లక్షణంగా వదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిరాశలో చిరువ్యాపారులు

తెలంగాణ పాడిపారిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి 26 నెలలు కావొస్తున్న ప్రారంభించకపోవడం, వాటికి వేలం నిర్వహించకపోవడంతో స్థానికులు, చిరువ్యాపారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉపాధి పొందుదామని ఎదురు చూస్తున్న ఎంతో మంది నిరుద్యోగులు, చిరువ్యాపారులు భవనాలు ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. అటు ప్రారంభించకుండా ఇటు వేలం నిర్వహించి, అద్దెకివ్వకుండా సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు మండి పడుతున్నారు.

పెరిగిన జనాల తాకిడి

మండల కేంద్రం కావడంతో జనాల తాకిడి భారీగా పెరిగి, అద్దెకు షాపులు దొరకని పరిస్థితి నెలకొంది. కద్దాల్ పట్టణ నడిబొడ్డున పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ప్రభుత్వం వ్యాపార సముదాయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఎదురు చూశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపై చిన్న, చిన్న డబ్బాలు, కొట్టులను ఏర్పాటు చేసుకొని కొన్నేళ్లుగా ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. ఏడేళ్ల క్రితం శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు విస్తరణతో ఇరువైపులా ఉన్నా చిరు దుకాణాలన్నింటిని తొలగించడంతో ఎంతో మంది చిరు వ్యాపారులు నష్టపోయారు. దాదాపు 50 కుటుంబాల వరకు ఉపాధి కోల్పోయారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించి, వేలం నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

కమ్యూనిటీ హాల్ పరిశీలన

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో అసంపూర్తి ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌ను ఆ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో మున్సిపల్ నిధులు కేటాయించి హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. రాకేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ కొండాను కలిసిన నాయకులు



చేవెళ్ల: పట్టణ బీజేపీ నాయకులు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీతో పార్టీ సభ్యత్వ నమోదు విషయాలపై వారు చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో యువ నాయకుడు డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మానిక్యరెడ్డి, నాయకులు శ్రీశైలంయాదవ్, కె.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బోచుపల్లి జంగయ్య(60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి సోమవారం జంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.12 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, యాదయ్య, తిరుపతయ్య, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన గ్రామ కమిటీ కార్యవర్గం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో పద్మశాలి గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో పద్మశాలి సభ్యులందరూ సమావేశమయ్యారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుక్కుడాల మల్లేశ్, ఉపాధ్యక్షులుగా ఏలె రమేశ్, కాడిగె మధు, పల్లాటి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా గణేష్, సహాయ కార్యదర్శులుగా రాకేష్, శశికుమార్, ముఖ్య సలహాదారులుగా పాండయ్య, జనార్దన్, వీరేశలింగం, శివరాజు మిగతా కార్యవర్గంలో పలువురిని ఎన్నుకున్నారు.

మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడ గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘం సభ్యులు, నాయకులు కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 10 మహిళా సంఘాల్లో 108 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో భవనంలేని కారణంగా వారు సమావేశాలు, ఇతర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు శ్రావన్, నర్సింహ, సాలయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



కేఎల్లార్‌కు మొక్క అందజేస్తున్న శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణం, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మరింత చెందుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. అంతకు ముందు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, జంగయ్య, శ్రీశైలం, గణేశ్, పరమేశ్, సేవ్యానాయక్ పాల్గొన్నారు.

పేదలను విస్మరించిన ప్రభుత్వాలు

- ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర సర్కార్లు విఫలం
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి

యాచారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో సోమవారం పార్టీ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. జెండావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తూ పేదల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనుల మీద దాడులు పెరిగిపోయినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయిందన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ధరణి భూ సమస్యలు, కార్మికులకు సరైన గుర్తింపు లేకపోవడం వంటి సమస్యలపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. పేదలకు అండగా ఉండేది సీపీఎం పార్టీయేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం నేటి నుంచే కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకుడు కానమోని యాదయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నూతన మాల్ గ్రామ శాఖ కార్యదర్శిగా బట్టు సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు చందునాయక్, గిరి, సాయికుమార్, రాములు, యాదయ్య, సుదర్శన్, శివాని, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాల్‌లో జెండావిష్కరణ చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం

భారీ ర్యాలీగా తరలివచ్చిన నాయకులు

మహేశ్వరం: కొంగరకలాన్ ఫ్రాక్స్‌కాన్ కంపెనీ పనులను పరిశీలించడానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రావిర్యాల ఔటర్‌రింగ్ ఎగ్జిట్ 13 వరకు భారీ ర్యాలీగా చేరుకొని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఔటర్ దిగగానే కేఎల్లార్‌తో పాటు నాయకులు కలిసి కాంగ్రెస్ కండువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, ఎర్రవాపు ఇశ్రాయేల్, కాకి ఈశ్వర్, కృష్ణనాయక్, రాజునాయక్, లచ్చానాయక్, జానకీరామ్, జైపాల్‌రెడ్డి, రాజు, రంజిత్‌కుమార్, మురళీధర్‌రెడ్డి, లాజర్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

● టైర్ జారిందా.. అంతే!



రోడ్డుపైనే పేరుకుపోయిన మట్టి

తుర్కయంజాల్: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సాగర్ రహదారిపై ఇసుక, మట్టి పేరుకుపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మూడు లైన్‌ల రహదారి కాస్తా.. రెండు లైన్‌ల రోడ్డుగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డుపైకి నీటితో పాటు ఇసుక, మట్టి కొట్టుకువచ్చి పేరుకుపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టి పక్షం రోజులు గడుస్తున్నా అధికారులు శుభ్రం చేయించడం లేదు. దీంతో రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు జారీ పడుతున్నారు. దీనికి తోడు దుమ్ము, ధూళి ముంచెత్తుతుంది. ఇప్పటికైనా అధికారుల స్పందించి వెంటనే రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా రోడ్డును వెంటనే శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

ఇబ్రహీంపట్నం: పశుసంవర్ధక శాఖ సిబ్బంది మంగళవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నారు. ఈ మేరకు ఆ శాఖ ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకులు వసంతకుమారి, ఎల్మినేడు, కొంగరకలాన్ పశువైద్యాధికారులు వై.ఆనందరెడ్డి, సరితలు తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఎల్మినేడు, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, దండుమైలారం, 21 నుంచి 25వ తేదీ వరకు తులేకలాన్, ఆదిబట్ల, శేరిగూడ, రాయపోల్, 26 నుంచి 30వ తేదీ వరకు తుర్కగూడ, మంగల్‌పల్లి, పోల్కంపల్లి, సీతారాంపేట, నవంబర్ 1వ తేదీ నుంచి 5 వరకు చర్లపటేల్‌గూడ, నాగన్‌పల్లి, బొంగుళూర్, రాందాస్‌పల్లి, కర్ణంగూడ, ఖానాపూర్, 6 నుంచి 11వ తేదీ వరకు కప్పాడ్, ముకునూర్, పోచారం, ఉప్పరిగూడ, 12, 13, 14వ తేదీల్లో మిగిలిన పశువుల కోసం టీకాలు వేసేందుకు కేటాయించినట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి పశువులకు టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆమనగల్లు పరిధిలో..

ఆమనగల్లు: మండల పరిధిలో మంగళవారం నుంచి వచ్చే నెల 14వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇస్తున్నట్లు పశువైద్యాధికారి చింతోజు అగ్నివేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధితో సోకకుండా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అవకాశన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఆమనగల్లు, 17న శెట్టిపల్లి, 18న సింగపల్లి, 19న పోలెపల్లి, 21న కొత్త కుంట తండా, 22న రానుంతాల, 23న కోనాపుర్, 24, 25 తేదీల్లో విటాయిపల్లి, 26న మంగళపల్లి, 28న చింతలపల్లి, 29న మేడిగడ్డ, 30న శంకర్ కొండతండా, 2న నుచ్చుగుట్ట తండా, 4న ఆకుతోటపల్లి, 5న సంకొటోనిపల్లి, 6న సీతారాం నగర్ తండా, 7న ముర్తుజపల్లి, 8న జంగారెడ్డిపల్లి గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు ఇస్తారని తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కార్పొరేటర్ ఏనుగుల అనిల్‌యాదవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు విధులు నిర్వహించారని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.



ఇన్‌స్పెక్టర్ నాగరాజును సన్మానిస్తున్న కార్పొరేటర్ అనిల్‌యాదవ్

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

శంకర్‌పల్లి: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో దుర్గామాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిని పలు హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించి, ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. దీంతో శంకర్‌పల్లిలో సోమవారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. అమ్మవారి నిమజ్జనోత్సవం



ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో అమ్మవారి చీర వేలంలో భక్తులు



ఆమనగల్లు: వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో..



మాడ్గుల: శోభాయాత్రలో యువత ఉత్సాహం



అబ్దుల్లాపూర్‌మెట్: అమ్మవారి చీరను వేలంలో దక్కించుకున్న నవీన్



కద్తాల్: ఊరేగింపులో దుర్గామాత మిత్రమండలి సభ్యులు, భక్తులు



ఆమనగల్లు: భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో శోభాయాత్ర

ఇబ్రహీంపట్నం: యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్లపటేల్‌గూడలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనోత్సవం సోమవారం నిర్వహించారు. దూపదీప నైవేద్యాలతో నిత్యం పూజలందుకున్న దుర్గమ్మ చీరను మారమోని సత్యం యాదవ్ రూ.62 వేలకు, ముక్కుపుడకను పట్నం శ్రీశైలం రూ.38 వేలకు, లడ్డూను మారమోని నగేష్‌యాదవ్ రూ.23 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమనగల్లు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటం, యువకుల నృత్యాల ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక సుర సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు వీరబ్రహ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమండ్ల నరసింహ, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

మాడ్గుల: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో దుర్గ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటం, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విష్ణు, మహేష్, విజయ్, మిద్దె రాములు, సురేష్, శ్రీను తదితరులు భక్తులు పాల్గొన్నారు.

ఎక్వాయిపల్లిలో..

కద్తాల్: విజయదశమిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ముక్కుపుడకను రూ.1.31 లక్షలకు బత్తుల ఆంజనేయులుగౌడ్ కైవసం చేసుకోగా, 19 కిలోల లడ్డూను పాలకూర్ల యాదయ్యగౌడ్ రూ. 85 వేలకు, లక్ష్మీ దండను రూ.50 వేలకు మల్లేశ్‌గౌడ్, పెద్ద చీరను రూ. 31 వేలకు ఈర్లపల్లి లక్ష్మణ్, చిన్న చీరను పడాల బాలరాజ్‌గౌడ్ రూ. 24 వేలకు వేలంలో కైవసం చేసుకున్నారు.

హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలో గౌరెల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి నిమజ్జన వేడుక వైభవంగా సాగింది. విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి శోభ భక్తులను కనువిందు చేసింది. అనంతరం జరిగిన వేలంలో పెద్ద చీరను మాజీ వార్డు సభ్యుడు గ్యార నవీన్ కుమార్ రూ.18 వేలకు కైవసం చేసుకున్నారు.